TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 183 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.28.01.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## మోగిన మున్సిపల్ నగారా



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షెడ్యూల్ విడుదల చేశారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల్లో ఒకే విడతలో ఫిబ్రవరి 11న ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నామని వివరించారు. నేటి నుంచి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న తుది అభ్యర్థుల జాబితా విడుదల కానుంది. పోలింగ్‌లో ఏవైనా అవాంతరాలు జరిగితే 12న రీ పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 14న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక కోసం సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తారని వివరించారు. ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నిక నిర్వహిస్తారనీ, ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహిస్తామని చెప్పారు.

8,203 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

ఎన్నికలు జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో 8,203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని వివరించారు. ఇందులో 25.62 మంది పురుష ఓటర్లు, 26.80 మంది మహిళా ఓటర్లు, 640 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. బ్యాలెట్ పేపర్ విధానంలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణకు 16,031 బ్యాలెట్ బాక్స్‌లు, 137 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 136 లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పోలింగ్ నిర్వహణకు 742 మంది జోనల్ అధికారులు, 279 ఎఫ్ఎస్టీ, 381 ఎస్ఎస్టీ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 1,547 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 9,560 మంది పోలింగ్ ఆఫీసర్స్, 31,428 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు మొత్తం 45,316 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహిం చేందుకు ఓటర్లు, పోటీచేసే అభ్యర్థులు సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లందరూ పోలింగ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని రాణి కుముదిని పిలుపు నిచ్చారు.

ఎన్నికలు జరగని మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లు ఇవే..

కాల పరిమితి ముగియని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించడం లేదని పురపాలక శాఖ శాఖ డైరెక్టర్ టీకే. శ్రీదేవి తెలిపారు. జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు కొత్తూరు, జడ్చర్ల, అచ్చంపేట, సిద్దిపేట, నకిరేకల్ మున్సిపాల్టీలకు ఎన్నికలు జరగడం లేదన్నారు. ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఎన్నికలు జరుగుతున్నవాటితో పాటు రిజర్వేషన్లు ఖరారు చేసినట్టు తెలిపారు. అయితే వాటిలో వార్డులు, డివిజన్ల రిజర్వేషన్లను ఖరారు చేయలేదని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతానికి మించకుండా నిబంధనల ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు శ్రీదేవి తెలిపారు.

రూ.50 వేల వరకు నగదుకు అనుమతి లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్‌భగవత్

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున రూ.50 వేల వరకు మాత్రమే నగదు అనుమతి ఉందని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. అంతకంటే ఎక్కువ ఉంటే అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద ఉంచుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 25 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. సెన్సిటివ్, క్రిటికల్, కమ్యూనల్ సెన్సిటీవ్, సాధారణ పోలింగ్ స్టేషన్లను గుర్తించి నాలుగు విభాగాలుగా విభజించామన్నారు. కమ్యూనల్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలైన నిర్మల్, బైంసా, బోధన్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడంతో పాటు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామపం చాయతీ ఎన్నికల సందర్భంగా 1,800 లైసెన్స్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామనీ, అర్బన్ ప్రాంతాల్లో ఉన్న వాటిని సైతం స్వాధీనం చేసుకుం టామని చెప్పారు. రౌడిషీటర్లు, ఎన్నికల నేరస్తులను బైండోవర్ చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వ హణకు సంబంధించి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదీ షెడ్యూల్

జనవరి 28 నుంచి 30వరకు నామినేషన్లు

జనవరి 31న పరిశీలన

ఫిబ్రవరి 3న ఉపసంహరణ అనంతరం తుది జాబితా..

ఫిబ్రవరి 11న ఒకే విడతలో పోలింగ్

రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న..

ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు

16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక

అనివార్య కారణాలతో ఈ ఎన్నికలు ఎక్కడైనా జరగకుంటే ఫిబ్రవరి 17న నిర్వహిస్తారు

## పేదలను దోచుకుంటున్న కార్పొరేట్ స్కూల్స్



నల్లగొండ :అమృత్ తెలంగాణ: కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా అర్హత లేని సిబ్బందితో బట్టీ చదువులు చెబుతూ.. పేదలను దోచుకుంటున్నాయని, తాను విద్యాశాఖ మంత్రి అయితే రాష్ట్రంలో అలాంటి స్కూళ్లను మూసేస్తానని రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు కలిగిన ఉపాధ్యాయలచే నాణ్యమైన బోధన సాగుతోందని చెప్పారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బొట్టుగూడ పాఠశాల భవన నిర్మాణం తన చిరకాల కోరిక అని, పేదవాడు చదువుకోవాలి, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. 2500 గజాల స్థలంలో అత్యాధునిక వసతులతో భవనాలు నిర్మించామని చెప్పారు. సంప్రదాయ విద్య కాకుండా అన్ని రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తామన్నారు. పాత సిలబస్‌తో పాటు, సీబీఎస్ఈ అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూల్స్ పేదలను దోచుకుంటున్నాయని, తాను విద్యాశాఖ మంత్రిని అయితే అలాంటి స్కూల్స్ అన్నింటినీ మూసేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశం హాజరైన అధికారులు మరియు ముస్లిం నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి పవిత్ర రంజాన్ మాసాన్ని ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, మత పెద్దలతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్?తో కలిసి కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని, అందువల్ల అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సహర్, ఇఫ్తార్ సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మసీదుల వద్ద వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. మసీదులు, ఈద్గాల పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పండుగ సమయంలో పండ్లు, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో ఉండేలా సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అధికారులు, మత పెద్దలు సమన్వయంతో రంజాన్ వేడుకలు ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, రంజాన్ మాసంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల భాగంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలలో 'అరైవ్ అలైవ్' అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, యువత రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్?కు దూరంగా ఉండాలని సూచించారు. రాత్రి 11:30 గంటల తర్వాత అనవసరంగా రోడ్లపై తిరగవద్దని, నాయకులు, పెద్దలు యువతకు సూచించాలని కోరారు. అనంతరం పలువురు మత పెద్దలు తమ సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కలీమ్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మసీదుల కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కుంభకోణంపై విచారణ జరపండి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: సింగరేణి కుంభకోణంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని లోక్‌సభవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నాయకుల బృందం కలిసి బొగ్గు కుంభకోణానికి సంబంధించి ఫిర్యాదు చేసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, సింగరేణిలో జరుగుతున్న దోపిడీ విషయంలో గవర్నర్‌కు వివరమైన నివేదికను అందజేశామని చెప్పారు. ఆధారాలతో సింగరేణి కుంభకోణాన్ని బయటపెట్టామనీ, దాన్ని డైవర్ట్ చేయడానికి, ప్రజల అటెన్షన్‌ని, దృష్టి మళ్లించడానికి, విచారణ పేరిట ఒకరి తర్వాత ఒకరిని సిట్ పిలుస్తున్నదని అన్నారు. సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదనీ, కోల్ మాఫియాకి నాయకుడిగా రాష్ట్ర ప్రజలు, సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి వచ్చిందన్నారు. రూ.పది కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేసి, సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆటకి వినియోగించారని అన్నారు. పారదర్శకతకు పాతరవేసి సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం ఎందుకు తెచ్చారో సమాధానం చెప్పడం లేదన్నారు. 2018 నుంచి 2024 వరకు ఆ నిబంధన కేంద్రం సిఫారసు చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని గుర్తు చేశారు. ఈ తొమ్మిది నెలల్లో సైట్ విజిట్ సర్టిఫికెట్లను సింగరేణి సంస్థ ఎన్ని జారీ చేసిందో శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో రింగ్ మాస్టర్ సృజన్‌రెడ్డి అనే వ్యక్తి ముఖ్యమంత్రి బామ్మర్ది అవునా కాదా అని అడిగితే ఇంతవరకు సమాధానం రాలేదన్నారు. నైనీ టెండర్లే కాకుండా మిగతా టెండర్లనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ పవర్ స్కామ్ గురించి బయట పెట్టామని అన్నారు. అన్ని విషయాలనూ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇందులో జోక్యం చేసుకోవాలనీ లేదంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆదేశం ఇవ్వాలని గవర్నర్‌ను కోరామని వివరించారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టే ఈ దుర్మార్గపు వ్యవస్థను, అటు సోలార్ పవర్‌లో కుంభకోణం, ఇటు సింగరేణి ఓబీ గనుల్లో కుంభకోణం జరిగిందనీ, దీన్ని అడ్డుకోవాలని విన్నవించామని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి,

మాజీమంత్రులు తన్నీరు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం మహాజాతర షురూ..




వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/ తాడ్వాయి/ అమృత్ తెలంగాణ: మంగపేట తెలంగాణ కుంభమేళా.. కోట్లాదిమంది గిరిజనుల ఆరాధ్య దైవాలు సమ్మక్క–సారలమ్మ మహా జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 28 నుంచి నాలుగు రోజులపాటు జరిగే ఈ మహా ఉత్సవానికి ములుగు జిల్లాలోని మేడారం సర్వం సిద్ధమైంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామం నుంచి మంగళవారం సమ్మక్క మేనల్లుడు పగిడిద్దరాజు బయలుదేరడంతో జాతర మొదటి ఘట్టం ప్రారంభమైంది. బుధవారం సాయంత్రానికి గద్దెపైకి చేరుకుంటారు. అదే రోజు సాయంత్రం 6.00గంటల సమయంలో కన్నెపల్లి నుంచి ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో సారలమ్మను డోలు, కొమ్ము వాయిద్యాలతో గద్దెలపైకి చేర్చనున్నారు. ఈ క్రమంలో ములుగు జిల్లా కొండాయి నుంచి గోవిందరాజు కూడా బయలుదేరి వచ్చి గద్దెపై కొలువుదీరనున్నాడు. ఇలా బుధవారం సాయంత్రం 6 గంటల వరకు పగిడిద్ద రాజు, సారలమ్మ, గోవిందరాజు గద్దెలపైకి చేరుకుంటారు. ఆ తర్వాత చిలుకలగుట్టపై నుంచి సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్య కిందకు తీసుకురాగానే ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గాలిలోకి కాల్పులు జరిపి స్వాగతం పలుకుతారు.

డోలు, కొమ్ము వాయిద్యాలు, ఆదివాసీ యువతీయువకులు నృత్యాల నడుమ 29వ తేదీ(గురువారం) సాయంత్రం 6 గంటలకు సమ్మక్క మేడారం గద్దెపై కొలువుదీరనుంది. 30వ తేదీన గద్దెలపై వీరవనితలకు సందర్శకులు మొక్కులు సమర్పించుకుంటారు. 31వ తేదీన సాయంత్రం 6 గంటలకు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజులు వన:ప్రవేశం చేయడంతో మేడారం జాతర ముగుస్తుంది. ఈ క్రమంలో అడుగడుగునా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ టి.ఎస్ దివాకర, అధికారులు పాల్గొంటారు. ఈ అపురూప దృశ్యాలను తిలకించడానికి లక్షలాది మంది జనం మేడారం గద్దెల పరిసర ప్రాంతానికి చేరుకుంటున్నారు. జాతర కోసం అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. గత కొన్ని రోజులుగా సందర్శకులు పెద్ద సంఖ్యలో మేడారం చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

మేడారం జాతరకు తొలి అడుగు..

గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలో మంగళవారం సమ్మక్క మేనల్లుడు పగిడిద్దరాజును పెనక వంశీయుల సంప్రదాయం ప్రకారం.. పెండ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. పగిడిద్దరాజుకు మేడారం సమ్మక్క దేవాలయం నుంచి పట్టువస్త్రాలు తెచ్చిన మంత్రి సీతక్క పెనక వంశీయులకు అందజేశారు. పసుపు, కుంకుమలు అద్ది, వెదురు ప్రతిమ రూపంలో పడిగెపై పగిడిద్దరాజును ఉంచి సుమారు 70 నుంచి 80కిలోమీటర్ల అటవీ మార్గం గుండా కాలినడకన మేడారానికి బయలుదేరారు. దారి పొడవునా కన్నెపల్లి, గుండ్లవాగు ప్రాజెక్టు వంటి ప్రాంతాల్లో బస చేస్తారు. ముఖ్యంగా పూనుగొండ్ల మహిళలు 'వరుడిగా వెళ్లి.. మరువెళ్లికి రావయ్యా' అంటూ సాగనంపుతారు.

పగిడిద్దరాజు మేడారం గద్దెపై కొలువుదీరిన తర్వాతే, మహాజాతర అధికారికంగా ప్రారంభమైనట్టు. ఆ తదుపరి చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని తీసుకొచ్చే ప్రధాన ఘట్టం మొదలవుతుంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది సందర్శకులు తరలి వస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ స్వీకరణ ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్


పరిశీలిస్తున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా


అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డులకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం పరిశీలించారు. స్థానిక టీటీడిసిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన అనంతరం, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. 49 వార్డుల నామినేషన్ల స్వీకరణకు మొత్తం 17 టేబుల్స్ ఏర్పాటు చేసి, రిటర్నింగ్ అధికారులను నియమించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఇతర అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా పాటించాలి : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్


సమావేశానికి హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : పట్టణ స్థానిక సంస్థల 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనవరి 28 నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ ప్రక్రియ దృష్ట్యా, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపులో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించడంలో ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం వహించకూడదని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, నోడల్ అధికారి మనోహర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష


కలెక్టర్ ఎస్పీ మాట్లాడుతున్న దృశ్యం


అధికారులతో సమావేశమైన కలెక్టర్

నిర్మల్ జిల్లా జనవరి 27 అమృత్ తెలంగాణ నిర్మల్ మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సరిపడా సిబ్బంది, బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో శంకర్, డీఈవో భోజన్న, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ బీర్ల సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు



ఆలేరు అమృత్ తెలంగాణ: ఆలేరు పట్టణంలోని ఒకటవ వార్డు కొలనుపాక రోడ్డుకు చెందిన కుంచం ఆంజనేయులుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు వివిధ రాజకీయ పార్టీలను వీడి మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు,అభివృద్ధి దిశగా సాగుతున్న పాలనపై విశ్వాసంతోనే పార్టీలో చేరినట్టు తెలిపారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికలలో మొదటి వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి చింతలఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించుటకు అంకితభావంతో కృషి చేస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ద్వారపు శంకర్, దోనకొండ కృష్ణ,ఎం.డి.పాషా,పూల సిద్దు,బొట్ల రాజేష్,కుంచెం అజయ్, యాదగిరి,పాకాల రాకేష్,చింటూ,శివ, మధు, భాను, కొంగ రాకేష్, బొడ్డు తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు ప్రేరణ తరగతులు.





నిర్మల్ జిల్లా జనవరి 27 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లోని వివిధ బీసీ ప్రీ మెట్రిక్ సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థులందరికీ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు మంగళవారం బాసర ఐఐఐటీ ప్రాంగణంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నిపుణులు పరీక్షలపై భయం, ఒత్తిడిని అధిగమించే మార్గాలను విద్యార్థులకు వివరించారు. ఉన్న సమయాన్ని పకడ్బందీగా వినియోగించుకొని పరీక్షలకు ఎలా సన్నద్ధం అవ్వాలో శిక్షణ ఇచ్చారు. పలువురు సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ లు సబ్జెక్టుల వారిగా తరచూ అడిగే ప్రశ్నలు, పరీక్ష రాసే మెలుకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎబిసిడిఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# గొంతులో ఇరుక్కున్న మటన్ బోన్ చాకచక్యంగా తొలగించిన వైద్యులు నవీన్ ఆడేపు



అమృత్ తెలంగాణ మంచిర్యాల న్యూస్ : మంచిర్యాల జిల్లా లోని చెన్నూరు మండలం సుబ్బారావు పల్లి గ్రామానికి చెందిన టి. శ్రీనివాస్ సోమవారం రాత్రి భోజనం చేస్తుండగా గొంతులో అనుకోకుండా మటన్ బోను ఇరుక్కోవడం జరిగింది. అతడు మంచినీరు తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడటంతో వారి కుటుంబ సభ్యులు మంచిర్యాల లోని కాకతీయ గ్యాస్ట్రో అండ్ లివర్ హస్పటల్ వైద్యులు డాక్టర్ నవీన్ ఆడేపు ను సంప్రదించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు నవీన్ ఎండోస్కోపీ ద్వారా అదునాతనమైన పరికరాలతో గొంతులో ఇరుక్కున్న మటన్ బోన్ ను చాకచక్యంగా తొలగించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు వైద్యులు నవీన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. వైద్యులు నవీన్ మాట్లాడుతూ ఇలాంటి సందర్భాలలో సరియైన సమయంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రి కి తీసుకురావడం వల్లే శ్రీనివాస్ ను ప్రాణాపాయం నుండి కాపాడుటకు వీలు కలిగిందన్నారు. గతంలో ఇలాంటి చికిత్స లకోసం హైదరాబాద్ లాంటి పట్టణాలకు వెళ్ళేవారని ఇప్పుడు మన మంచిర్యాలలోని కాకతీయ గ్యాస్ట్రో అండ్ లివర్ ఆసుపత్రి లో అధునాతన పరికరాలు ఉండడంవల్ల శ్రీనివాస్ కు చికిత్స చేసి కాపాడగలిగామన్నారు.

# ఐదు రోజుల పనివిధానం కోసం బ్యాంకు ఉద్యోగుల సమ్మె

## భారీ ర్యాలీ నిర్వహించిన బ్యాంకు ఉద్యోగులు




అమృత్ తెలంగాణ మంచిర్యాల న్యూస్ : ఐదురోజుల పని విధానం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మంచిర్యాల, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంచిర్యాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.స్థానిక ఎస్బిఐ బ్యాంకు నుండి బెల్లంపల్లి చారస్తా, బస్టాండ్, మార్కెట్ రోడ్, అర్చన టెక్స్ చారస్తా, వెంకటేశ్వర చారస్తా మీదుగా ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ బి ఐ ఎస్ యు హెచ్ సి మంచిర్యాల రిజియన్ సెక్రటరీ కొక్కుల శ్రీనివాస్ మాట్లాడుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్ బియు) పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉదోగులు సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు.2024 లో 12వ వేతన సవరణ జరిగిన సందర్భంగా ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐ బి ఏ)ఈ డిమాండ్ ను అంగీకరించి, ఒప్పందం చేసుకుందన్నారు. అయినప్పటికీ ఇప్పటికి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం వల్ల బ్యాంకు ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. అంతే కాకుండ బ్యాంకింగ్ రంగంలో సిబ్బంది కొరత, అధిక పనిభారం, లక్ష్యాల ఒత్తిడి, డిజిటలైజేషన్ పేరుతో పెరుగుతున్న భాద్యతలు ఉద్యోగుల పై తీవ్ర మానసిక, శరీరక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆర్బిఐ, ఎస్ ఈ బి ఐ, ఎల్ ఐ సి, నాబార్డ్, ఐ ఆర్ డి ఏ తదితర ఆర్థిక సంస్థల్లో వారానికి ఐదు రోజుల పని విధానం అమలులో ఉందన్నారు. కాని బ్యాంకు ఉద్యోగులకు మాత్రం ఇది అమలు చేయకపోవడం విడ్డురంగా ఉందని, యు ఎఫ్ బి యు స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. అయినప్పటికి ప్రభుత్వం వెంటనే ఐదు రోజుల పని విధానం తక్షణమే అమలు చేయాలని, ఐ బి ఏ తో కుదిరిన ఒప్పందాలను గౌరవించి, అమలు చేయాలని, బ్యాంకు ఉద్యోగుల పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఒక్క రోజు చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెకు ప్రజలు ఖాతాదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎల్ డి ఎం తిరుపతి,ఏ ఐ బి ఓ సి, ఆర్ఎస్. వెంకటేష్,అశోక్, సత్యనారాయణ, వసంత్ కుమార్,విష్ణు చరణ్, నీలం రమేష్ తదితర బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కొరకు ప్రత్యేక ప్రేరణ- అవగాహన తరగతులు


## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య




అమృత్ తెలంగాణ మంచిర్యాల ప్రతినిధి : జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ అవగాహన తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులముల వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులకు మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో చదువుచున్న 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ-అవగాహన తరగతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ఇష్టంతో చదివి, పట్టుదలతో సాధించి ఉన్నత స్థానాలలో నిలవాలని, తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రేరణ-అవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, విషయ నిపుణులైన ఉపాధ్యాయులు ఇచ్చే మెలకువలను పాటించి, అన్ని సబ్జెక్టులలో 100 శాతం మార్కులు సాధించాలని, వార్షిక ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణతతో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని, 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ డైట్, స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ధర్మానంద్ గౌడ్, ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని






అమృత్ తెలంగాణ మంచిర్యాల ప్రతినిధి : రాష్ట్రంలో పారదర్శకమైన మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డి. జి. పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు– కలెక్టర్లు, జిల్లా అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, జోనల్, నోడల్ అధికారులు, పర్యవేక్షణ బృందాలు, పి ఓ లు, ఎ పి ఓ లు, ఎన్నికల సిబ్బంది నియామకం ప్రతి అంశంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమాలని ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఎన్నికలలో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పర్యవేక్షించాలని, స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి – కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో 34 వార్డులు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 18 వార్డులు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 22 వార్డులు, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 15 వార్డులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వెబ్ కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పి ఓ లు, ఓ పి ఓల నియామకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేసిన జువ్వాడి నర్సింగరావు.



మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 27: మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు మెట్పల్లి మండలం మరియు పట్టణం నా లోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడినర్సింగారావు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈరోజు మెట్పల్లి మండలంకు 14.లక్షలపై చిలుకు రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అలాగే మెట్పల్లి పట్టణం చెందిన 70. మంది కి 14 లక్షల పై చిలుకు రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ఇవ్వడం జరిగిందని మొత్తం 29 లక్షల ఇరవై ఆరువేల ఎనిమిది వందల రూపాయలు లబ్ధిదారులకు ఈరోజు ఇవ్వడం జరిగింది. దాదాపు రెండు సంవత్సరాలు నుండి ఐదు కోట్లపైగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందని ఇది తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక నిధులు మంజూరు అయ్యాయని అలాగే గొర్రె పెల్లి లో విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్తు గతానికిగురై దాని పైనుండి కింద పడి మరణించిన ఆయన కుటుంబ సభ్యులకు ఐదు లక్షల బీమా చెక్కును ఇవ్వడం జరిగిందని పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇవ్వడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వచ్చాక అత్యధిక అభివృద్ధి పనులు జరిగాయని ఇది ప్రజలు గెలిపించుకున్న ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కోరుట్ల మెట్పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జై కేతనం ఎగరవేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జట్టిలింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మైలారం లింబాద్రి, మాజీ జెడ్పిటిసి ఆకులు లింగారెడ్డి,ద్యావన పెల్లి రాజారాం.తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపథంలో కోరుట్ల నియోజకవర్గం. జువ్వాడి నర్సింగరావు.



మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 27: మెట్పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వడి నర్సింగరావు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక అత్యధిక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని మహిళలకుబస్సు ఫ్రీ 200 యూనిట్ల కరెంటు ఉచితం ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు500రూపాయలుసిలిండర్సబ్సిడీ వంటి కార్యక్రమాలు ఎన్నో చేశాయని అలాగే సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో మంచి అభివృద్ధి జరిగినా మున్సిపాలిటీలలో కోరుట్ల నియోజకవర్గం కోరుట్ల మున్సిపాలిటీలలో 18 కోట్ల 70 లక్షల రూపాయలు మెట్పల్లి మున్సిపాలిటీకి 18 కోట్ల డెబ్బై లక్షల మంజూరు పనులు మంత్రి ప్రారంభించారని అభివృద్ధి పనులు జరగాయని రెండు చైర్మన్ పీఠాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని అందరి సహకారంతో పట్టణంలోని బడుగు బలహీన వర్గాల ప్రజల ఆకాంక్ష మేరకు మున్సిపాలిటీలు కైవసం చేసుకుంటున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మైలారం లింబాద్రి, ధ్యావల పెల్లి రాజారాం, మాజీ జెడ్పిటిసి ఆకులు లింగారెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలని సందర్శించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి





జగిత్యాల అమృత్ తెలంగాణ జనవరి 27: జగిత్యాల అర్బన్ కాలని డబల్ బెడ్ రూం హౌసింగ్ కాలనిలో కమలాకర్ షాప్ షార్ట్ సర్క్యూట్ తో కాలిపోవడంతో షాప్ సందర్శించి అధికారులతో మాట్లాడి జరిగిన ప్రమాదానికి అంచనా వేసే విదంగా చర్యలు తీసుకున్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అనంతరం,నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనిలో సందర్శించారు కాలనీ ప్రజలు అక్కడి సమస్యలు జీవన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు అర్బన్ కాలనీ సందర్శించారు మాజీ మంత్రి జీవన్ రెడ్డి అర్బన్ కాలనీ పరిస్థితి చూసిన జీవన్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం నూకపల్లి అర్బన్ కాలనీని 2 వార్డులు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులకు అనుగుణంగా అర్బన్ కాలనిలో 2 వార్డులు ఏర్పాటు చేయాలని చెప్పాను అధికారులకు సైతం పలు సార్లు సూచించడం జరిగింది అర్బన్ కాలనీ కౌన్సిలర్ ఇక్కడి ప్రతినిధి ఇక్కడే ఉంటే వారి,సమస్యలువారు,పరిష్కరించుకుంటారు అని ప్రతిప్రధాన చేశాను,అర్బన్ కాలనీ 520 లోకేషన్ దాదాపు 2 సంవత్సరాల క్రితం నుండి ఇక్కడ నివాసితులు అయి ఉన్నారు.500 ల కుటుంబాలు అంటే 2000 ఓట్స్ అని అన్నారు అధికారులకు పలు సార్లు వారి దృష్టికి తీసుకెళ్లిన చర్యలు తీసుకోలేదు ఈరోజు నూకపల్లి అర్బన్ కాలనిలో కనీస మౌలిక సదుపాయాలు లేవు నివాసిత ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు అని అన్నారుడ్రైనేజీ సమస్య వీది దీపాల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నూకపల్లి అర్బన్ కాలనీ పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు కాలనీకి ఎన్ని రోజులకు ఒక్కసారి చెత్త బండి వస్తుంది ఎన్ని రోజులకు ఒక్కసారి డ్రైనేజీ తీస్తున్నారు అని అధికారులను అడిగారు అర్బన్ కాలనీ పారిశుద్యం మున్సిపల్ బాధ్యత కాద అని అడిగారు ఎప్పటి వరకు సమస్యను పరిష్కరిస్తారు అని అడిగారు స్పందించిన అధికారులు వెంటనే సమస్య పరిష్కారం చేస్తాం అని జీవన్ రెడ్డి గారికి అధికారులు తెలిపారు,నూకపల్లి అర్బన్ ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ బాధితులకు అండగా జిల్లా పోలీసులు.

**బాధితునికి 20,000 బ్యాంకు చెక్కు కోర్టు ద్వారా తిరిగి అందజేత.**

**1930 ద్వారా ఫిర్యాదు.**

**సైబర్ క్రైమ్ లో గోల్డెన్ హవర్ ముఖ్యమైనది.**

**డబ్బు తిరిగి అందజేయడంతో సంతోషం వ్యక్తం చేసిన సైబర్ క్రైమ్ బాధితుడు.**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహబూబ్ ఖాన్ సియాసత్ అనే ఉర్దూ పత్రిక నందు రిపోర్టర్గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయన గత 2024 సంవత్సరం మార్చి నెలలో తన మొబైల్ ఫోన్ను పోగొట్టుకున్నాడు, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ఆధారంగా సైబర్ క్రైమ్ నిందితులు తన అకౌంట్ నుండి విడతలవారీగా గత నవంబర్ 2025 వరకు తన అకౌంట్లో ఉన్న 2.45 లక్షలను తస్కరించారు. తన సొంత అవసరాల నిమిత్తం బ్యాంకుకు వెళ్లగా అసలు నిజం వెలుగులోకి వచ్చింది, తనకు తెలియకుండానే తన అకౌంట్ నుండి డబ్బులు పోవడంతో, బ్యాంకు అధికారులు తెలిపిన నిజాల ప్రకారం సైబర్ క్రైమ్ జరిగిందని వెంటనే 1930కి ఫిర్యాదు చేయడంతో చివరగా మోసపోయిన డబ్బుల నుండి 20వేల రూపాయలు నిందితుడి అకౌంట్లో ఫ్రీజ్ చేయడం జరిగింది. ఈ డబ్బులను జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జడ్జి గారి సహాయంతో 20వేల రూపాయలను తిరిగి చెక్కు ద్వారా వచ్చే విధంగా ఇతరులను జారీ చేశారు. వచ్చిన చెక్కును జిల్లా ఎస్పీ గారు బాధితునికి అందజేయడంతో, బాధితుడు సంతోషం వ్యక్తం చేశాడు. సైబర్ క్రైమ్ బాధితులు 1930 కి గోల్డెన్ హవర్లో ఫిర్యాదు చేసిన యెడల మోసపోయిన డబ్బు ఎక్కువ శాతం తిరిగి వచ్చే విధంగా చేయవచ్చని తెలిపారు. ఆర్థిక నేరాలలో ముఖ్యంగా ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, సైబర్ అరెస్ట్, డిజిటల్ అరెస్ట్, నకిలీ వెబ్ అప్లికేషన్లు, ఏఐ ఆధారిత మోసాలు ప్రస్తుతం చలామణిలో ఉన్నాయి వాటి వల్ల అప్రమత్తతో ఉండాలని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ గోపికృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జైనథ్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ హై స్కూల్ / జూనియర్ కళాశాల నుజిల్లా కాంగ్రెస్ కమిటీ (ణజజ) అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ సందర్శించారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న వసతులు, భవన నిర్మాణ నాణ్యత, తరగతి గదులు, హాస్టల్ సదుపాయాలు, త్రాగునీరు, భోజన వసతి వంటి అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. విద్య అనేది సామాజిక అభివృద్ధికి పునాది అని, ముఖ్యంగా బీసీ వర్గాల విద్యార్థులకు ఇలాంటి రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ

“పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. ఇలాంటి విద్యాసంస్థలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును మార్చే శక్తి కలిగివుంటాయి. అవసరమైన చోట మరింత సదుపాయాలు కల్పించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తాము” అని పేర్కొన్నారు.

విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, మంచి విద్యాభ్యాసం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు.

ఉపాధ్యాయుల కృషిని అభినందిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జైనథ్ గ్రామ సర్పంచ్ రజిత జగదీష్ రెడ్డి ఛాజజ మాజీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ రెడ్డి గారు,ఆదిలాబాద్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు అంబకంటి అశోక్ తొడసం దౌలత్ రావు తో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు మున్సిపాలిటీ కాంగ్రెస్ కౌన్సిలర్లుగా బరిలో నిలిచేది వీరే

ఆలేరు ఆలేరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లుగా పోటీ చేసే ఆ పార్టీ నాయకుల జాబితాను మంగళవారం పట్టణ అధ్యక్షుడు ఎం ఏ ఎజాజ్ నవతెలంగాణకు తెలిపారు. ఎలాగైనా ఈసారి చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సర్వే నిర్వహించి గెలుపొందే అభ్యర్థులను గుర్తించి వారిని పోటీలో ఉండేందుకు ముందస్తు ప్రచారం మొదలు పెట్టమని ఆదేశించినట్లు చెప్పారు.

ఎక్కడినుండి ఎవరు పోటీ

1 వార్డు నుండి చింతల ఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి. 2 వార్డ్ వానరాశి మరియమ్మ మార్క్. 3 వార్డ్ సందుల సురేష్. 4 వార్డ్ గుత్త శమంత రెడ్డి. 5 వార్డ్ చింతకింది మురళి. 6 వార్డ్ అంగిడి ఆంజనేయులు 7 వార్డ్ బిజన (సిద్ధంకి) బాలమణి భాస్కర్. 8 వార్డ్ పాము అనిత. 9 వార్డ్ పస్తం ఆంజనేయులు. 10 వార్డ్ మల్లెల సరిత శ్రీకాంత్. 11 వార్డ్ జూకంటి సంపత్. 12 వార్డ్ జెట్ట నీరజ సిద్ధులు పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.

పార్టీ బీఫామ్ వస్తుందన్న నమ్మకంతో12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సమన్వయ పరుచుకుంటూ వార్డులలో ప్రభావితం చేసే వ్యక్తులను యువతను ఆకట్టుకునే ప్రయత్నాలు పోటీలో ఉండే కౌన్సిలర్లు మంగళవారం ఉదయం నుండే మంతనాలు ప్రారంభించారు.

ఆలేరు మున్సిపాలిటీ ఏర్పడి తర్వాత రెండో ఎన్నిక

ఆలేరు మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత ఇది రెండవ ఎన్నికలు మొదటి ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో అధికార పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ 8 స్థానాలు గెలిచి చైర్మన్ వైస్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది.కాంగ్రెస్ పార్టీ ఒకటి ఇండిపెండెంట్లు రెండు బిజెపి ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి.గతంలో ఆలేరు మున్సిపాలిటీలో భాగంగా ఉన్న సాయి గూడెం 954 ఓటర్లతో నూతన గ్రామపంచాయతీ గా ఏర్పాటయింది.ఈసారి జరిగే ఎన్నికల్లో 13663 మొత్తం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు

# సోనాల ఎస్సీ కార్పొరేషన్ భూములకు నీటి సౌకర్యాన్ని కల్పించండి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల




అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ అదిలాబాద్ జిల్లా డిస్టిక్ షెడ్యూల్ ఆఫీసర్ డిడి సునీత ని రమేష్ బత్తుల ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో కసి సోనాల మండలంలోని కోటాకే శివారం యందు గల ఎస్సీ కార్పొరేషన్ భూములను 1995 –96 కాలంలో 27 మంది లబ్ధిదారులకు చెరో రెండు ఎకరాల చొప్పున ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమిని ప్రభుత్వం ఇచ్చిందని కానీ నీటి సౌకర్యం లేక నష్టపోతున్నామని వెంటనే బోర్లు మంజూరు చేసి దళిత రైతులను ఆదుకోవాలని సునీత మేడమ్ కి వినతి పత్రం అందజేశారు వేడం సానుకూలంగా స్పందించి త్వరలోనే బోర్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు ఇట్టి కార్యక్రమంలో భగత్ ప్రవీణ్, ఏరేకర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# బైకుపై గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సుడిగాలి పర్యటనలు

- బైకుపై వెళ్లి - భరోసా కల్పించి
- మా జీవిత చరిత్రలోనే మా గ్రామానికి ఎమ్మెల్యే రావడం మొట్టమొదటి సారి
- మీకు రుణపడి ఉంటాం
- దాంశ్య తాండ, సుర్ధాపూర్, రెంగన్ వాడి గ్రామస్తులు
- సమస్యల పరిష్కారానికె గ్రామ పర్యటనలు



బైక్ నడుపుతున్న శాసనసభ్యులు అనిల్ జాదవ్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ నెరడిగొండ మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలు దాంశ్య తాండ, సుర్ధపూర్, రెంగన్ వాడి గ్రామాల్లో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బైకుపై సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే గారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మా గ్రామ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఎమ్మెల్యే పర్యటించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు మా సమస్యల కొరకు సుడిగాలి పర్యటనగా వచ్చి మాకు ధైర్యం చెప్పడం మా అదృష్టమన్నారు. రెంగన్ వాడి గ్రామంలో నూతనంగా నిర్మించిన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు అనిల్ జాదవ్

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల నుంచి కనీస రోడ్డు సౌకర్యాలు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాలను ఆకస్మికంగా పర్యటించి పరిశీలించాలని నిర్ణయించుకొని బైకుపై పర్యటనలు ప్రారంభించడం జరిగిందన్నారు. కచ్చితంగా రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు వేయించడమే ప్రథమ లక్ష్యంగా ముందుకు సాగుతానని అన్నారు. పర్యటించిన ప్రతీ గ్రామ బాధను విన్నానని నేను ఉన్నానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# బోథ్‌లో 'ప్రేరణ' క్రీడా పోటీల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి బోథ్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎస్ (PM Shri TGSWRS) బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల మైదానంలో రేపటి (జనవరి 28) నుండి నిర్వహించనున్న 'ప్రేరణ' (ఆదిలాబాద్ జిల్లా స్థాయి బాలికల క్రీడా, సాంస్కృతిక పోటీలు–2026) కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

జనవరి 28 నుండి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు "బాలికా సాధికారత – ప్రతిభను గుర్తించడం – భవిష్యత్తు నిర్మాణం" అనే నినాదంతో ఈ క్రీడా సంబరాలు జరగనున్నాయని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు ప్రారంభోత్సవం లో గుస్సాడి నృత్య ప్రదర్శన, రెండవ రోజు ప్రత్యేక మ్యాజిక్ షో, మూడవ రోజు ముగింపు వేడుకల్లో జబర్దస్త్ టీమ్ ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నామన్నారు.

అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఈ పరిశీలనలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, సంక్షేమ శాఖల అధికారులు మిల్కా, జిల్లా క్రీడా అధికారి శ్రీనివాస్ రాజలింగం, డిడి అంబాజీ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ కెనాల్ లో గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం



కెనాల్ లో పడిన మృతుడి ఫైల్ ఫోటో

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ జనవరి 27 ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన జింక గంగాధర్ ం/శీ గంగారం,48 సం.లు, గుండ్ల కులానికి చెందిన వ్యక్తి తేదీ 26.1.2026 రోజున రాత్రి సుమారు 8:00 గంటల సమయంలో ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కెనాల్ లో పడి అదృశ్యం అవ్వగా, మృతుడి సోదరుడు అయిన జింక శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతని ఆచూకీ కోసం ఎస్సారెస్పీ కెనాల్ వెంబడి గాలిస్తుండగా తేదీ 27.1.2026 రోజున మధ్యాహ్నం సుమారు 2:00 గంటల సమయంలో ఇబ్రహీంపట్నం గ్రామ శివారులో మృతుడి శవం ఎస్సారెస్పీ కెనాల్ నీటిలో గుర్తించి మృతుడి సోదరుడు జింక శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది.

# మానవత్వం చాటుకున్న సోలిపురం సర్పంచ్..

మునుగోడు అమృత్ తెలంగాణ: గ్రామ ప్రజల సంక్షేమం కోసం సోలిపురం గ్రామపంచాయతీ కార్మికుడిగా కొన్ని సంవత్సరాలుగా పనిచేసి మృతి చెందిన ఇరిగి చంద్రయ్య కుటుంబానికి గ్రామపంచాయతీ నుండి అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని గత సర్పంచ్ లు అందించకపోయారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నకరేకంటి మురళీకృష్ణ మంగళవారం ఆ కుటుంబ సభ్యులకు రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని తమ సొంత డబ్బులను అందజేసి మానవత్వం చాటుకున్నాడు. ఈ సందర్భంగా సర్పంచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ .. గ్రామంలో చాలీచాలని వేతనాలకు పనిచేసిన గ్రామపంచాయతీ కార్మికులను గౌరవించుకున్నప్పుడే గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు గ్రామపంచాయతీ కార్మికులు నిరంతరం ప్రజల కోసం సేవ చేస్తారని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుడి కష్టాన్ని గుర్తించి ఆ కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్ మురళికి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ , గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భరత్ , వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

# జ్యోతి పూర్వాజ్.. సింపుల్ గానే హీటెక్కించేసింది



ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే నటీమణుల్లో జ్యోతి పూర్వాజ్ ఒకరు. నటిగా మాత్రమే కాకుండా, సోషల్ మీడియాలో గ్లామర్ ఫొటోషూట్లతో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే నటీమణుల్లో జ్యోతి పూర్వాజ్ ఒకరు. నటిగా మాత్రమే కాకుండా, సోషల్ మీడియాలో గ్లామర్ ఫొటోషూట్లతో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమె తాజా ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. రెస్టారెంట్‌లో కాఫీ లేదా వాటర్ గ్లాస్‌తో ముస్తాబైన ఈ ఫోటోషూట్ చాలా స్టైలిష్ గా, ఫ్రెష్ గా కనిపిస్తోంది. ఈ ఫోటోలలో జ్యోతి మరీ అందంగా మెరిసిపోయింది. రెడ్ నెక్ టాప్, ఓపెన్ హెయిర్ స్టైల్, లైట్ మేకప్‌లో ఆమె లుక్ చాలా ఆకట్టుకుంటోంది. మెగాస్టార్ చుట్టూ హనుమంతుల సందడి కళ్లలో వున్న సాఫ్ట్ ఎక్స్‌ప్రెషన్స్, స్మైలింగ్ ఆమె సౌందర్యాన్ని మరింత మెరిపించాయి. ముఖ్యంగా ఆమె నాచురల్ బ్యూటీకి సోషల్ మీడియా యూజర్లు ఫిదా అవుతున్నారు. ఇటీవల జ్యోతి పూర్వాజ్ కొన్ని టీవీ షోస్, యూట్యూబ్ ఇంటర్వ్యూల ద్వారా పాపులర్ అయింది. ఇప్పటికే కొన్ని చిత్రాల్లో సపోర్టింగ్ రోల్స్ చేసిందామె. అయితే మోడలింగ్, గ్లామర్ ఫోటోషూట్ల ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు ఆమె వెబ్ సిరీస్‌లు, ఓటీటీ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో జ్యోతి పూర్వాజ్ కి ఫాలోయింగ్ భారీగానే ఉంది. ప్రతి ఫోటోపోస్ట్‌కు వేలల్లో లైక్స్, వందలలో కామెంట్స్ వస్తుండటంతో ఆమె క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. తన అందాన్ని బోల్డ్‌గా, కాన్ఫిడెంట్‌గా ప్రెజెంట్ చేస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ఈ లేటెస్ట్ ఫోటోలు చూస్తుంటే.. ఆమె కెరీర్ కొత్త దిశలో సాగుతుందని, మరిన్ని అవకాశాలు ఆమె కోసం ఎదురుచూస్తున్నాయన్న నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. సింపుల్ కానీ స్టైలిష్ లుక్స్‌లో కనిపిస్తున్న జ్యోతి, నటనతో పాటు గ్లామర్ ఆటిట్యూడ్ తో కూడా అలరిస్తోంది. త్వరలోనే ఓటీటీలు లేదా మ్యూజిక్ వీడియోల ద్వారా మరింతగా ప్రేక్షకుల మన్ననలు పొందే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఇస్మార్ట్ బ్యూటీకి ఈసారైనా హిట్ దక్కేనా?

మోడలింగ్ తో కెరీర్ ను స్టార్ట్ చేసిన కావ్య థాపర్ ఆ తర్వాత హీరోయిన్ గా మారిన సంగతి తెలిసిందే. మోడలింగ్ తో కెరీర్ ను స్టార్ట్ చేసిన కావ్య థాపర్ ఆ తర్వాత హీరోయిన్ గా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో అమ్మడు చేసిన మొదటి సినిమా ఈ మాయ పేరేమిటో. కానీ ఆ మూవీ ఆశించిన స్థాయిలో ఆడియన్స్ ను ఆకట్టుకోలేకపోయింది. కావ్య ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే ఏడేళ్లు అవుతుంది. కానీ స్టార్‌డమ్ ను మాత్రం సొంతం చేసుకోలేకపోయింది. ఈ మాయ పేరేమిటో తర్వాత ఏక్ మినీ కథ సినిమా చేసి ఆ సినిమాను నేరుగా ఓటీటీలో రిలీజ్ చేసి మంచి హిట్ అందుకుంది. ఏక్ మినీ కథ తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న కావ్య తెలుగుతో పాటూ తమిళంలో కూడా సినిమాలు చేస్తూ వస్తోంది. అయితే అన్ని భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ కావ్యకి పెద్దగా కలిసి వచ్చింది మాత్రం ఏం లేదు. దీంతో టాలీవుడ్‌నే నమ్ముకుని కావ్య సినిమాలు చేస్తూ వస్తోంది. రెండేళ్ల ముందు వరకు ఏడాదికి ఒక సినిమా చేసుకుంటూ వచ్చిన కావ్య, గతేడాది ఏకంగా నాలుగు సినిమాలు చేసింది. మాస్ మహారాజ రవితేజతో ఈగల్, సందీప్ కిషన్ హీరోగా వచ్చి ఊరు పేరు భైరవకోన, రామ్ పోతినేని తో డబుల్ ఇస్మార్ట్, గోపీచంద్ తో కలిసి విశ్వం సినిమా చేసింది. గతేడాది కావ్య నుంచి వచ్చిన నాలుగు సినిమాల్లో ఊరు పేరు భైరవకోన సినిమా తప్పించి మిగిలినవన్నీ డిజాస్టర్లుగానే నిలిచాయి. ఈ హ్యాట్రిక్




డిజాస్టర్లు కావ్య కెరీర్ పై చాలా ఎఫెక్ట్ చూపించింది. దీంతో అమ్మడికి ఆఫర్లు రాలేదు. ఆఫర్లు రాక కెరీర్లో గ్యాప్ తీసుకున్న కావ్య వెకేషన్ కు వెళ్లి మళ్లీ రీసెంట్ గానే తిరిగొచ్చింది. వెకేషన్ నుంచి వచ్చిన కావ్య ఇప్పుడు తిరిగి సినిమాలపై ఫోకస్ చేసింది. ఈ నేపథ్యంలోనే కావ్య ఓ సినిమాకు కమిటైనట్టు టాక్ వినిపిస్తుంది. ధమాకా డైరెక్టర్ త్రినాథరావు నక్కిన చేయనున్న అప్‌కమింగ్ ప్రాజెక్టులో హీరోయిన్ గా కావ్య ఎంపికైనట్టు ఫిల్మ్ నగర్ లో టాక్ వినిపిస్తోంది.

# పింక్ అందాల బాస్ పార్టీ బ్యూటీ

ఈ అమ్మడు మోడల్ గా కెరీర్ ను ఆరంభించి ఎన్నో సినిమాల్లో మరియు కమర్షియల్స్ లో నటించి మెప్పించింది. మెగాస్టార్ చిరంజీవితో వాల్తేరు వీరయ్య సినిమాలో ఐటెం సాంగ్ చేయడంతో పాటు పలు సినిమాల్లో ఐటం సాంగ్స్ చేయడం ద్వారా సౌత్ ప్రేక్షకులకు సుపరిచితం అయిన బాలీవుడ్ ముద్దుగుమ్మ ఊర్వశి రౌతేలా. ఈ అమ్మడు మోడల్ గా కెరీర్ ను ఆరంభించి ఎన్నో సినిమాల్లో మరియు కమర్షియల్స్ లో నటించి మెప్పించింది.






# చీరలో అయేషా అందం..



ఈ స్టిల్ మామూలుగా లేదు ఈ ఏడాది శ్రీవిష్ణు హీరోగా వచ్చిన ఓం భీమ్ బుష్ మూవీలో ఓ కీలక పాత్రలో అయేషా ఖాన్ నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లో గట్టిగా వినిపిస్తోన్న పేరు అయేషా ఖాన్. ఒక్క ఐటెం సాంగ్ తో టాలీవుడ్ లో విపరీతమైన క్రేజ్ ని ఈ బ్యూటీ సొంతం చేసుకుంది. మోడల్ గా, సోషల్ మీడియా ఇన్ ఫ్ల్యూన్సర్ గా కెరియర్ స్టార్ట్ చేసిన అయేషా ఖాన్ హిందీలో ఓ ఆల్బం సాంగ్ లో నటించింది. ముఖచిత్రం మూవీతో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఈ ఏడాది శ్రీవిష్ణు హీరోగా వచ్చిన ఓం భీమ్ బుష్ మూవీలో ఓ కీలక పాత్రలో అయేషా ఖాన్ నటించింది. ఈ పాత్రకి మంచి గుర్తింపు వచ్చింది. విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో ఐటెం సాంగ్ తో ఒక్కసారిగా అయేషా ఖాన్ అందరి కళ్ళు తనవైపు తిరిగేలా చేసుకుంది. ఆ సాంగ్ లో ప్రస్తుతం సోషల్ లో విపరీతంగా ట్రెండింగ్ అవుతోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com